# సోదర భావానికి రక్షా బంధన్

సందడిగా రక్షా బంధన్ వేడుకలు — సోదర అనుబంధాన్ని చాటుకున్న అక్కా చెల్లెళ్లు



పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు రాఖీ కడుతున్న మహిళలు



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు రాఖీ కడుతున్న దేవనార్ ఫౌండేషన్ విద్యార్థులు

సికింద్రాబాద్/అడ్డగుట్ట/బొల్లారం/మారేడ్‌పల్లి/బేగంపేట్/అమీర్‌పేట్/బన్సీలాల్‌పేట, ఆగస్టు 19: రాఖీ పండుగను పురస్కరించుకొని సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. తమ సోదరులకు రాఖీ కట్టి మమకారాన్ని చాటుకున్నారు. అక్కా, చెల్లెల్లు, అన్నదమ్ముల ప్రేమానురాగాలు జీవితాంతం తోడుండాలనే ఆకాంక్షతో రాఖీ పౌర్ణమిని సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు.

- పండుగ నాడు వర్షంలో సైతం తమ సోదరులకు రాఖీలు కట్టాలని ఆడపడచులు తమ పుట్టింటికి బయలుదేరి రక్షా బంధన్‌ను నిర్వహించుకొన్నారు. ఈ సందర్భంగా బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. రద్దీ వాతావరణంతో రోడ్లన్నీ ట్రాఫిక్‌తో కిటకిటలాడాయి. మిఠాయి దుకాణాలు, తాత్కాలికంగా ఏర్పడ్డ రాఖీ షాపుల్లో కొనుగోలుదారులతో సందడి నెలకొంది.
- సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ మోండా మార్కెట్ టకార బస్తీలోని ఆయన నివాసంలో సోమవారం రక్షా బంధన్ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఆయన సోదరి శకుంతలమ్మ పద్మారావుకు రాఖీ కట్టి ఆశీర్వదించారు. పలువురు అభిమానులు కూడా ఈ సందర్భంగా రాఖీలు కట్టగా, ఆయన స్వీట్లు పంచారు. అక్కా తమ్ముళ్ల, అన్నా చెల్లెల్ల అనురాగానికి రక్షా బంధన్ ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.
- పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నా చెల్లెలు, అక్కా తమ్ముల ఆత్మీయ అనుబంధానికి రక్ష బంధన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ మహిళలను తమ సోదరీమణులుగా భావించి, అండగా ఉన్నప్పుడే అందరికి నిజమైన సార్థకత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు నాగినేని సరిత, తదితరులు పాల్గొన్నారు.
- బేగంపేట్‌లోని దేవనార్ అంధుల పాఠశాలలో హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో దేవనార్ ఫౌండేషన్ నిర్వాహకులు సాయిబాబా గౌడ్, జ్యోతిగౌడ్ పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలో అన్నకు రాఖీలు కడుతున్న చెల్లెలు



బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ పాలక మండలి మాజీ సభ్యుడు కూతురు నర్సింహకు రాఖీ కడుతున్న అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ ఎన్. శేషుకుమారి



కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్‌కు కంటోన్మెంట్ ఏడో వార్డు సాయిబాబ హట్స్‌కు చెందిన శ్రుతి ఆయన నివాసంలో రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు.



తిరుమలగిరి మిలటరీ దవాఖానలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య సైనికులకు, రోగులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు



రక్షాబంధన్ సందర్భంగా లష్కర్‌లో ఓ ఇంట్లో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు



ట్రాఫిక్ పోలీసులకు రాఖీ కడుతున్న స్కై ఫౌండేషన్ సభ్యులు




గాంధీ దవాఖానలో సెక్యూరిటీ గార్డుకు రాఖీ కడుతున్న జనహిత సేవా ట్రస్ట్ చిన్నారులు

## పవిత్రోత్సవ సహిత మహా కుంభాభిషేకం



ఆలయంలో జరిగిన మహా కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్న అభినందవోద్దండ విద్యా శంకర భారతీ మహా స్వామి

మారేడ్‌పల్లి, ఆగస్టు 19: సికింద్రాబాద్ గణపతి ఆలయంలో సోమవారం 'పవిత్రోత్సవ సహిత మహా కుంభాభిషేకం' జరిగింది. అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి వారి చేతుల మీదుగా పూజలు జరిగాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొని గణనాథుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వినోద్, మాజీ చైర్మన్ ఒదెల సత్యనారాయణ, సదానంద్‌గౌడ్, అశోక్, శ్రీశైలం, బద్రినాథ్ యాదవ్, సంతోష్‌యాదవ్, ఆర్డీ నాగేశ్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ గణపతి ఆలయంలో గణనాథుడికి దర్శించుకొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

## మారేడుపల్లి తహసీల్దార్‌ను కలిసి బీఆర్‌ఎస్ నాయకులు


అడ్డగుట్ట, ఆగస్టు 19: మారేడుపల్లి తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భీమయ్యగౌడ్‌ను బీఆర్‌ఎస్ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు ఏఆర్ కృష్ణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పరిధిలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందేల చూడాలని ఈ సందర్భంగా ఆయన కోరినట్లు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నేత ప్రకాశ్ ఉన్నారు.



తహసీల్దార్ భీమయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మెట్టుగూడ అధ్యక్షుడు ఏఆర్ కృష్ణ


## మహంకాళి ఆలయంలో చండీహోమం

*బేగంపేట్, ఆగస్టు 19: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయంలో సోమవారం పౌర్ణమిని సందర్భంగా చండీహోమం నిర్వహించారు. ఈ హోమంలో 150 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సారి రాఖీ పౌర్ణమి రోజున హోమం నిర్వహించడం విశేషమని ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు సురిటి కామేశ్, మాజీ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.*



దేవాలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు.. పాల్గొన్న ఈవో మనోహర్‌రెడ్డి, భక్తులు

## బీజేపీ నేతను పరామర్శించిన గవర్నర్ దత్తాత్రేయ




ఆకుల బాలనర్సింహను పరామర్శిస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

అమీర్‌పేట్, ఆగస్టు 19: బీజేపీ సీనియర్ నాయకుడు ఆకుల బాలనర్సింహను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం పరామర్శించారు. బాలనర్సింహ కొద్ది రోజులుగా వయోభార సమస్యలతో బాధపడుతున్నారు. బీకేగూడలోని ఆయన నివాసంలో బాలనర్సింహ సతీమణి విజయ దత్తాత్రేయకు రాఖీ కట్టారు. బీజేపీ సనత్‌నగర్ కోకన్వీనర్ ఆకుల మహేశ్, లింగంపల్లి నర్సింగ్‌రావు, దయానంద్, హృషికేశవ (ఉమ), ఆకూరి శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

## సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు

మారేడ్‌పల్లి, ఆగస్టు 19: రెజిమెంటల్‌బజార్‌లోని సంతోషిమాత ఆలయ 42వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత సాయన్న, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, బోర్డు మాజీ సభ్యురాలు నళిని, అనిత అమ్మవారికి దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఒదెల అజయ్ వారిని శాలువాతో సత్కరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మురళీయాదవ్, చిన్నా, ఓదెల సత్యనారాయణ, బస్తీవాసులు నందికంటి రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రెజిమెంటల్‌బజార్‌లోని ఆలయంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత, మాజీ బోర్డు సభ్యులు నళిని, అనిత, తదితరులు

## ఆడుకుంటూ గదిలో బందీ.. సురక్షితంగా బయటకు

అమీర్‌పేట్, ఆగస్టు 19: గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకున్న రెండేళ్ల బాలుడిని సనత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సనత్‌నగర్ ఎస్ఆర్టీలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు.. సనత్‌నగర్ ఎస్ఆర్టీ 461లో ఉంటున్న షేక్ షరీఫ్ కొడుకు షేక్‌హసన్ మోయినుద్దీన్ (2) ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో సెల్‌ఫోన్‌లో ఆడుకుంటూ ఓ గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు తెరిచేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇంటి యజమానితో కలిసి తలుపులు బద్దలు గొట్టే ప్రయత్నం చేయగా, లోపల ఆందోళనకు గురైన బాబు గట్టి ఏడవడంతో.. ఏం చేయాలో తోచలేదు. విషయాన్ని అక్కడే ఉన్న కొందరి సూచనల మేరకు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న ప్రశాంత్ సిబ్బందితో కలిసి వెళ్లి క్రోబార్‌తో తలుపులు తెరిచి బాబును సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. బాబుకు వాంతులయ్యాయని, అయితే బాబు క్షేమంగా ఉన్నాడని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.



గది తలుపులు తెరుస్తున్న అగ్నిమాపక సిబ్బంది, ఇన్‌సెట్‌లో బాలుడు షేక్ హసన్ మోయినుద్దీన్

## ఎమ్మెల్సీని కలిసిన ఎస్ఎఫ్ఏ కార్మికులు



ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఎఫ్ఏ కార్మికులు

సికింద్రాబాద్, ఆగస్టు 19: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ 29 ఎస్ఎఫ్ఏ కార్మికులు ఎమ్మెల్సీ కోదండరాంను కలిశారు. సోమవారం తార్నాకాలోని కోదండరాం నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను ఆయనకు వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ సూపర్‌వైజర్ బానోతు రమేశ్, సురేశ్, యాదగిరి, దశరథ్, నయీమ్, శేఖర్, శ్రీకాంత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## హంతకులను ఉరితీయాలి



అమీర్‌పేట్, ఆగస్టు 19: కోల్‌కత్తాలో వైద్యురాలిని దారుణంగా హత్య చేసిన నిందితులను గుర్తించడంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ విఫలమైందని బీజేపీ సీనియర్ నాయకుడు వెల్లాల రామ్మోహన్ అన్నారు. నిందితులను ప్రభుత్వం రక్షిస్తోందని ఆరోపిస్తూ పార్టీ సీనియర్ నాయకులు మోహన్, వెంకట సుబ్బారావు, మల్లారెడ్డి, అమ్ము రాంప్రసాద్, ఆనంద్, రవిచంద్రలతో కలిసి సోమవారం సాయంత్రం సనత్‌నగర్ స్వామి థియేటర్ చౌరస్తాలో బెంగాల్ సీఎం మమతా బెనర్జి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో వైద్యురాలి హంతకులను గుర్తించి చట్టం ముందుకు తేవాల్సిందేనని పేర్కొన్నారు.

## కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ




సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న యూపీహెచ్‌సీ డాక్టర్లు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, ఆగస్టు 19: కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో వైద్యురాలిపై జరిగిన దారుణ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని సీతాఫల్‌మండి కార్పొరేటగర్ హేమ డిమాండ్ చేశారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ, కుట్టి వెళ్లోడి ఆస్పత్రి యూపీహెచ్‌సీ సంయుక్తంగా పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం యూపీహెచ్‌సీ నుంచి సీతాఫల్‌మండి చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు వచ్చినా అఘాయిత్యాలు అగట్లేదని, ఇలాంటి నీచులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆడ బిడ్డలకు రక్షణగా, అండగా ఉండాలని పలువురికి రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రత్యూష, లాస్యతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద తమకు రక్షణగా ఉండాలంటూ పోలీసులకు రాఖీలు కడుతున్న డాక్టర్లు

## చికిత్స చేయడం లేదని ప్రచారం

### చికిత్సలో నిర్లక్ష్యం లేదు: గాంధీ సూపరింటెండెంట్

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 19: చికిత్స కోసం వస్తే గాంధీ దవాఖానలో వైద్యులు పట్టించుకోవడం లేదని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఏపీ నుంచి వచ్చి అంబర్‌పేట్‌లో స్థిరపడి శ్రీనివాస్, సుశీల దంపతుల కుమార్తె జ్యోతి (25) ఆదివారం ఉదయం నాలుగో అంతుస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. ఆమెను 108 అంబులెన్సులో గాంధీకి తరలించారు. సమ్మె కారణంగా న్యూరోసర్జన్ వైద్యులు అందుబాటులో లేరని సిబ్బంది చెప్పారని, సీఎం రేవంత్‌రెడ్డి తమ బిడ్డను కాపాడాలని సోషల్ మీడియాలో అభ్యర్థించారు. పోస్ట్ వైరల్ కావడంతో వైద్యులు వెంటనే స్పందించారని, ప్రస్తుతం రెండో అంతస్తులోని టీఎంటీ వార్డులో తమ కూతురు చికిత్స పొందుతున్నదని బాధితురాలి తల్లిదండ్రులు తెలిపారు. వెన్నెముకకు తీవ్రమైన గాయం అయ్యిందని, బీపీ ఎక్కువగా ఉన్నదని, తగ్గాక వైద్యులు ఆపరేషన్ చేస్తామని చెప్పారని పేర్కొన్నారు.

బాధితురాలికి సత్వరమే చికిత్స అందించామని సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి తెలిపారు. గాంధీ దవాఖానలో రోగిని పట్టించుకోవడం లేదని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. జనరల్ సర్జరీ విభాగం వైద్యులు ఎక్స్‌రే, సిటీ స్కాన్ తీశారని, రక్త పరీక్షల కోసం నమునాలను సేకరించారన్నారు. ఆర్థోపెడిక్, న్యూరోసర్జన్లు ఆమెను పరీక్షించి వైద్యం అందించారన్నారు. స్కానింగ్‌ను పరిశీలించగా వెన్నెముక, నడుము, కాళ్ళలో ఫ్రాక్చర్ ఉన్నట్టు గుర్తించి వెంటనే ఆమెకు శస్త్రచికిత్స కూడా చేశారని వెల్లడించారు.